క్లుప్తంగా

బాలికల ఉజ్వల భవిష్యత్‌కు ప్రత్యేక కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శి సంధ్యారాణి, ఏఎన్‌ఎం హైమ

దేవరాపల్లి : యుక్త వయస్సులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్‌కు 'కిశోర వికాసం' కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి-1 ఎం.సంధ్యారాణి అన్నారు. దేవరాపల్లిలో కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. నేటి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 10 వరకు నిర్ణీత తేదీలలో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తొలి రోజు ఉషోదయ స్కూల్లో బాలికలు ఒకరినొకరు పరిచయం కార్యక్రమం, లక్ష్యాలు నిర్దేశించుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్‌ఎం డి.హైమ, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



మందులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి వీరజ్యోతి

నర్సీపట్నం : రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్యాధికారి వీరజ్యోతి వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. గొలుగొండ మండలం, కేడీ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌ను, మందుల స్టోర్‌ను పరిశీలించారు. సమయపాలన పాటించాలన్నారు. ప్రసవాలు వీలైనంత వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే జరిగేలా చూడాలన్నారు. ఇబ్బందికరమైన ప్రసవ కేసులు ఉంటే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేయాలి తప్ప ప్రైవేటు ఆస్పత్రులకు చేయవద్దని సూచించారు. డెలివరీ కేసులను ఆశాలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకువెళ్తున్నట్టు ఆరోపణలు ఉన్నందున వారి పనితీరుపై కన్నేసి ఉంచాలని వైద్యులకు సూచించారు.

కలిగొట్ల పీఏసీఎస్‌లో చలి వేంద్రం ప్రారంభం

దేవరాపల్లి : కలిగొట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో స్థానిక పర్సన్ ఇంచార్జ్ పి.గుణసుందరరావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చడంలో భాగంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు స్థానిక పీఏసీఎస్ సీఈవో ఆర్.వెంకటరావు తెలిపారు. తొలి రోజు మజ్జిగను పంపిణీ చేశారు. ఇకపై ప్రతి రోజు తాగునీటిని పంపిణీ చేస్తామన్నారు.

అదృశ్యమైన తల్లీబిడ్డలు కుటుంబ సభ్యులకు అప్పగింత



వరలక్ష్మి, పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట : మండలంలో గల అప్పంపాలెం గ్రామానికి చెందిన తల్లి, ఇద్దరు పిల్లలను పట్టుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. గత నెల 24వ తేదీన అప్పంపాలెం గ్రామానికి చెందిన చల్లపు వరలక్ష్మి, ఈమె ఇద్దరు పిల్లలతో కలిసి అనకాపల్లి ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. దీంతో ఆమె భర్త శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో వరలక్ష్మి ఉన్న ప్రదేశాన్ని కనిపెట్టి ఆమెను, ఇద్దరు పిల్లలను పట్టుకుని శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.



శిథిలమై ప్రమాదకరంగా తాండవ ఎడమ కాలువ 2కిలో మీటరు వద్ద నిర్మించిన క్రాస్ రెగ్యులేటర్



మూడు రోజుల క్రితం రేగ్యులేటర్ వద్ద అదుపు తప్పి కాలువలో పడిన ట్రాక్టర్

తాండవ క్రాస్ రెగ్యులేటర్ వద్ద భయం భయం

- శిథిలమైన క్రాస్ రెగ్యులేటర్
- తరుచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

నాతవరం : తాండవ ఎడమ కాలువపై రెండో కిలో మీటరు వద్ద నిర్మించిన క్రాస్ రెగ్యులేటర్ శిథిలమై ప్రమాదాలు జరిగి మనుషులు మరణిస్తున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. మండలంలో మాధవనగరం పంచాయతీ శివారు గంటావారి కొత్తగూడెం గ్రామ సమీపంలో తాండవ ప్రధాన కాలువ 2వ కిలోమీటరు వద్ద ఆయకట్టుకు నీరు తరలింపు సులభ తరం చేసేందుకు పంట పొలాలకు రైతులు వెళ్లడానికి క్రాస్ రెగ్యులేటర్ నిర్మించారు. ఈ క్రాస్ రేగ్యులేటర్ తాండవ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కట్టింది కావడంతో ప్రస్తుతం శిథిలమై ప్రమాదాలకు నిలయంగా మారింది.

ఇదే మార్గంలో పంట ఉత్పత్తుల తరలింపు

మాధవనగరం గంటావారి కొత్తగూడెం తాండవ గ్రామాలకు చెందిన రైతులు ఈక్రాస్ రెగ్యులేటర్‌పై నుంచి పంట పొలాలకు వెళ్తుంటారు. వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు పంట పొలాలకు వెళ్లడానికి ప్రధాన మార్గం ఈక్రాస్ రెగ్యులేటర్. ఆయా గ్రామాలకు ప్రజలు వ్యవసాయ రైతులు నిత్యం దీనిపై రాకపోకలు సాగించడం జరుగుతుంది. ఖరీఫ్ సీజన్‌లో తాండవ ప్రాజెక్టు నుంచి ప్రధాన గేట్ల ద్వారా నీటిని ఆయకట్టుకు విడుదల చేసేటప్పుడు కుడి ఎడమ కాలువలకు సర్దుబాటు చేసేందుకు ఈక్రాస్ రెగ్యులేటర్ కీలకంగా పని చేస్తుంది. తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం ప్రమాద స్థాయిలో ఉన్నప్పుడు తుపానుల సమయంలో కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించేటప్పుడు ఈ క్రాస్ రెగ్యులేటరు ద్వారా నీటిని తాండవ నదిలోకి విడుదల చేసేందుకు ఉపయోగిస్తుంటారు. ఇప్పుడు క్రాస్ రెగ్యులేటర్ పూర్తిగా శిథిలమైంది.

ప్రమాదాలకు నిలయంగా...

మూడు రోజుల క్రితం మాధవనగరం గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ భూముల్లోకి ట్రాక్టరుపై సేంద్రియ ఎరువులు ఈక్రాస్ రెగ్యులేటర్‌పై నుంచి తరలిస్తుండగా ప్రమాదం జరిగింది, ట్రాక్టరు బోల్తా పడడంతో మాధవనగరం గ్రామానికి చెందిన అల్లాడి లక్ష్మణ్ అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. ఈ విధంగా ఇటీవల కాలంలో బైక్‌లు ఇతర వాహనాలు అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పొలాల్లోకి వెళ్లే రైతులకు సైతం రాత్రి సమయంలో రెగ్యులేటర్ వద్ద ప్రమాదాలు జరిగి సంఘటనలు ఉన్నాయి. ఏళ్ల తరబడి శిథిలమైన ఈ క్రాస్ రెగ్యులేటర్‌ను బాగు చేయాలని ఈ ప్రాంత రైతులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. తాండవ రిజర్వాయరు అధికారులు ప్రమాదం జరిగినప్పుడల్లా ఈ క్రాస్ రెగ్యులేటర్‌ను పరిశీలించి వెళ్లడం తప్ప నివారణ చర్యలు చేపట్టిన దాఖలాలు కన్పించలేదు.

> **మరమ్మతులకు ప్రతిపాదనలు**
>
> క్రాస్ రెగ్యులేటర్‌పై ట్రాక్టర్లు ఇతర పెద్ద వాహనాలు వెళ్లరాదని నిలుపుదల చేశాం. అయితే మాకు తెలియకుండా వాహనాలు తిప్పుతున్నారు. క్రాస్ రెగ్యులేటర్ శిథిలం కావడంతో దాని కింద నుంచి ప్రత్యామ్నాయంగా దారి ఏర్పాటు చేశాం. రెగ్యులేటర్ బాగు చేసేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు చేశాం.
>
> – శ్యామ్‌కుమార్, తాండవ నాతవరం సెక్షన్ జేఈ

రేపు ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారి జాతర

- నేడు తొలేళ్లు జాతర
- నెల రోజుల నుంచి జరుగుతున్న ఉత్సవాలు రేపటితో ముగింపు



ఎం. కోడూరు మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్ : ఎం. కోడూరు ప్రధాన ఆరాధ్య దైవం మోదకొండమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. గత నెల 5 వ తేదీన అమ్మవారి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జాతర సందర్భంగా నేడు అనగా శనివారం సాయంత్రం తొలేళ్లు జాతర. అనంతరం ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శుక్రవారం తెలిపారు. కన్నులు మిరుమిట్లు గొలిపే భారీ విద్యుత్ దీపాలంకరణతో భారీ ఊరేగింపు జరుగుతుందని, 4వ తేదీ ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ వంటివి దాతలు సహకారంతో జరుగుతుంది. ఈ సందర్భంగా రాగమాలిక ఆర్కెస్ట్రా, తూర్పు రామాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం నుంచి బండ్ల వేషాలు, నేలవేషాలు, తప్పెట గుళ్లు, మహిళలు కోలాటం ప్రదర్శిస్తారు.

బలిఘట్టం సత్యనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు

నర్సీపట్నం : బలిఘట్టం ఉత్తరవాహినిలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకున్నారు. వారి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు రామం, అన్నవరం దేవస్థానం అర్చకులు స్వామి వారు, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనంతో పాటు స్వామి వారు అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, అంకురారోపణ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి దివ్య కల్యాణమహోత్సవం అనంతరం నీరాజన, మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాదం వితరణ చేశారు. అనంతరం అమృతేశ్వరనాట్య అకాడమీ వారి నాట్య ప్రదర్శన నిర్వహించారు.

నేడు షిర్డీసాయిబాబా మందిరం వార్షికోత్సవాలు

మాడుగుల రూరల్ : మాడుగులలో గల శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 26 వ వార్షికోత్సవాలు శనివారం నిర్వహించనున్నట్టు సాయి ఆలయ కమిటీ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము 5.15 గంటలకు కాగడా హారతి, అనంతరం మృత్యుంజయ హోమం, పంచామృతాభిషేకాలు, గోపూజ, సాయి వ్రతాలు, హారతి, మధ్యాహ్నం అన్నసమారాధన, విష్ణు సహస్రనామ పారాయణం, పల్లకీ ఉత్సవం, రాత్రి 8:30 గంటలకు హారతి, ప్రసాద వితరణ కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్ల ధర్నా



ఆర్డీవో కార్యాలయ డీటీ ఆశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు

నర్సీపట్నం : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు నర్సీపట్నం యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కనీస వేతనం ఇవ్వాలని..పెండింగ్ వేతనాలను చెల్లించాలని నినాదాలు చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయం డీటీ ఆశోక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు అడిగర్ల రాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడు వాహనాల నిర్వహణ సంస్థలు మారుతున్నాయి తప్ప డ్రైవర్ల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. రూ.8,800 జీతంలో కుటుంబాలను పోషించుకోలేక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ జీతాలు సకాలంలో చెల్లించకుండా నాలుగు, ఐదు నెలలకొకసారి వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మె ద్వారా సేవలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుతో రైవాడ ఆయకట్టుకు ముప్పే



దేవరాపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: చింతలపూడి, మారిక గ్రామాల మధ్య హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం జరిగితే రైవాడ జలాశయం ఆయకట్టుకు ముప్పు వాటిల్లుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అదానీకి చెందిన రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుతో రైవాడ ఆయకట్టుతో పాటు విశాఖ నగర వాసుల తాగునీటికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులకు అవసరమైన 213.80 ఎకరాల భూసేకరణకు మారిక గ్రామంలో విజయనగరం జిల్లా కలెక్టర్ గత నెల 23న ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వేపాడ మండలంలోని మారికకొండ, అక్కడి గిరిజనుల జీవనాధారమైన భూమిని అదానీకి కట్టబెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని స్థానిక గిరిజనులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. విద్యుత్ డిమాండ్ సమయంలో నీటిని పంప్ చేసి విద్యుదుత్పత్తి జరిగేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారన్నారు. నీటి నిల్వ కోసం దేవరాపల్లి మండలం సమ్మెద గ్రామానికి ఎగువ భాగంలో ఒకటి, దిగువ భాగంలో మరో రిజర్వాయర్ నిర్మించనున్నారని తెలిపారు. శారదానదిపై ఈ రెండు రిజర్వాయర్లు నిర్మిస్తే రైవాడ జలాశయానికి వచ్చే నీరు తగ్గిపోతుందన్నారు. రైవాడ జలాశయం కింద ఉన్న దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం, వేపాడ మండలాల్లో 21,344 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. జలాశయం నుండి విశాఖ నగర వాసులకు ప్రతి రోజూ 15 ఎంజీడీ తాగునీటిని సరఫరా చేస్తున్నారన్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రైవాడ జలాశయానికి వచ్చే నీటిని హైడ్రో పవర్ ప్లాంట్‌కు మళ్లిస్తే రైవాడ ఆయకట్టు భూములతో పాటు విశాఖ నగర వాసులకు తాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ నోటిఫికేషన్ రద్దు చేయకుంటే ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మైదాన ప్రాంత గిరిజనులను ఆదుకోవాలి



గిరిజనుల డిమాండ్లపై వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి గంగరాజు

నాతవరం : మైదాన ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి గంగరాజు అన్నారు. మండలంలో సరుగుడు సుందరకోట గ్రామ పంచాయతీలో గల గిరిజన పెద్దలతో కలిసి శుక్రవారం మన్యంలో తలపెట్టిన బంద్‌కు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.

ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ జీవో నంబర్ 3ను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, శత శాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలని అన్నారు. మైదాన ప్రాంతం 5వ షెడ్యూలులో నివాసం ఉంటున్న గిరిజనులకు ఏజెన్సీ గిరిజనులకు అందించే సదుపాయాలు అందించాలని, గిరిజనులకు స్పెషల్ డీఎస్సీ కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని అన్నారు. ఆదివాసీల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే రానున్న కాలంలో గిరిజనులు ఐక్యతగా ఉద్యమించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెండు పంచాయతీలకు చెందిన గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

రోజుకు రూ.307వచ్చేలా పని చేయండి



ఎస్.బి.పట్నం గ్రామసభలో మాట్లాడుతున్న ఎపీవో దాసరి కొండాజీ

నాతవరం : ఉపాధి హామీ పథకంలో పని చేసే ప్రతి కూలీకి రోజుకు రూ. 307 వచ్చేలా పని చేయాలని, మొక్కుబడి పనులు చేయరాదని ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. మండలంలో ఎస్‌బీపట్నం గ్రామంలో సర్పంచ్ ఎల్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ అడిగిన వెంటనే పని కల్పిస్తామన్నారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకంలో 8 లక్షలు పని దినాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తాండవ కాలువలో పూడిక తీయడం కోసం రూ.కోటి 50లక్షలతో 52వేలు పని దినాలు అదనంగా కలిప్ంచడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం నియమ నిబంధనలు ఈఏడాది చేసే పనుల వివరాలను సభలో ప్రజలకు వివరించారు, ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరగకుండా పని చేసే బాధ్యత వీఆర్పీలపైనే ఉందన్నారు. ఉపాధి నిధులతో చేస్తున్న పంచాయతీలో పలు అభివృద్ధి పనులను సర్పంచ్ సత్యనారాయణ గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రతి పంచాయతీలో ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలి



చెట్టుపల్లిలో నీటి తొట్టిని పరిశీలిస్తున్న పూర్ణిమాదేవి

చీడికాడ: ప్రతి పంచాయతీలో ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని చెట్టుపల్లి, వరహాపురం గ్రామాల్లో నీటి తొట్టిల నిర్మాణాలను పరిశీలించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ వేసవిలో ఈ నీటితొట్టిలను వినియోగించుకోవాలన్నారు. అలాగే ఉదయం 6 గంటల నుంచి 11 గంటలతో పని ముగించాలని వడదెబ్బ బారిన ఎవరూ పడకుండా ప్రభుత్వం నిర్ణయించిన రూ.307 వచ్చే విధంగా పనిచేయించాలన్నారు. బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ పీఎం బీమా చేయించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ హేమసుందర రావు, ఏపీఓ గోవిందరావు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన

కశింకోట: స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులు ఆటిజం అవేర్‌నెస్ డేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటిజం అనేది వ్యాధి కాదన్నారు. ఆటిజం అంటే న్యూరో లాజికల్ డెవలప్‌మెంటు డిజార్డర్‌గా తెలిపారు. ఆటిజంకు జన్యుపరమైన కారణాలు ఉన్నప్పటికి కచ్చితమైన కారణాలు ఎవరూ కనుగొనలేదన్నారు. హెచ్‌ఎం రామునాయుడు, భవిత ఉపాధ్యాయులు రమణమ్మ, దీప పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో ఆశాజనకంగా వేరుశనగ దిగుబడి



సీతంపేటలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి : ఆధునిక వ్యవసాయ పద్ధతులలో సాగు చేయడం ద్వారా వేరుశనగలో ఆశాజనకంగా దిగుబడి వస్తుందనడానికి సీతంపేట రైతే నిదర్శనమని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు డా. రాజ్‌కుమార్, డా. సౌజన్య, డా. సత్తిబాబు అన్నారు. నాగయ్యపేట పంచాయితీ శివారు సీతంపేటలో రైతు ఆదిరెడ్డి అచ్చింనాయుడు సాగు చేసిన వేరుశనగ పంటను స్థానిక మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మతో కలిసి శుక్రవారం వారు క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. గ్రామానికి చెందిన రైతు ఆదిరెడ్డి అచ్చింనాయుడు టిసిజిఎస్-1694 రకం వేరుశనగ పంటను సాగు చేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంట సాగు చేసిన నాటి నుంచి పంట తీసే వరకు ప్రతీ నెలా పంటను పరిశీలిస్తూ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, తెగుళ్ల నివారణ చర్యలను, సలహాలు, సూచనలు చేశారు. ఎకరానికి 60 కేజీల విత్తనం నాటగా, 1200 కేజీలకు పైబడి దిగుబడి వచ్చిందని, సాగు ఖర్చు రూ. 23,600 కాగా, రూ. 50వేలుకు పైబడి రాబడి వచ్చినట్టు రైతు అచ్చింనాయుడు తెలిపారు. ప్రతి రైతు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని అవగాహన కల్పించారు. వీరి వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నివారించాలి



బాలికలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నర్సీపట్నం ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త పేర్కొన్నారు. కిశోరి వికాసం-వేసవి కార్యచరణలో భాగంగా నర్సీపట్నం మున్సిపాలిటీ 9వ వార్డు వీర్రాజు థియేటర్ సమీపంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎవరైనా చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలను నిలుపుదల చేసి చదువు కొనసాగించేందుకు ప్రోత్సహిస్తామన్నారు. తల్లిదండ్రులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు రీత్యాగాని వేరువేరు కారణాలతో బాల్య వివాహాల సమస్యను ఎదుర్కొంటున్న బాలికలు ఎవరైనా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాలికలకు వివాహానికి చట్టపరమైన వయస్సు వచ్చేంతవరకు పిల్లలకు వివాహం చేయవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త పరవాడ రామకృష్ణ, సూపర్‌వైజర్ రామలక్ష్మి, ప్రసాద్, మహిళా పోలీసు, ఏఎన్‌ఎం, ఆశ, మెప్మా ఆర్పీ పాల్గొన్నారు.

మేలు చేసిన వర్షాలు

- పొలాల్లో దాదాపు పూర్తయిన వేసవి దుక్కులు
- నేల సారవంతం, సాగుకు అనుకూలం
- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు



వేసవి వానలతో పొలాల్లో దుక్కు చేస్తున్న ట్రాక్టర్



పొలాల్లో దాదాపు పూర్తయిన దుక్కులు

తుమ్మపాల: అకాల వర్షాలు వేసవి దుక్కులకు ఎంతో మేలు చేశాయి. ఏటా జూన్, మే నెలాఖరులో వేసవి దుక్కులు చేసేవారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో ముందుగానే దాదాపు పూర్తయ్యాయి. దాంతో నేల సారవంతంతోపాటు ఖరీఫ్ సాగుకు రైతులు ముందుగానే సిద్ధమవుతున్నారు. మరోవైపు చెరువుల్లో నీరు చేరడం, పొలాల్లో పచ్చిక పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికలు సిద్ధం.....

ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు దాదాపు 2,500 హెక్టార్ల వరకు ఖరీఫ్ సాగు ప్రణాళికలను రైతు సేవా కేంద్రాల వారీగా సిద్ధం చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లోను ఖరీఫ్‌లో వరి అధిక విస్తీర్ణంలో సాగు చేయడం పరిపాటి. ప్రతి రైతు వరి సాగు చేయడం సాంప్రదాయంగా భావిస్తారు. 2,250 హెక్టార్ల వరకు వరి సాగు చేస్తున్నారు. దీని అనంతరం నువ్వులు, మినుములు, వేరుశనగ వేస్తారు. సాధారణ విస్తీర్ణం 2,250 హెక్టార్లు ఉండగా, వర్షాభావ పరిస్థితులను బట్టి సాగు విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రెండో ప్రధాన పంట చెరకు ఏటా తగ్గుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 128 హెక్టార్లు మాత్రమే సాగు జరుగుతుంది. 122 హెక్టార్ల మేర కూరగాయలతోపాటు చిరుధాన్యాలు పండిస్తున్నారు. గత ఏడాది వర్షాలు ఆలస్యంతో పాటు వరినార్లు లేక సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. మరి ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

50 శాతం రాయితీపై పాడి రైతులకు పశుదాణా



పశువైద్య సహాయకులతో జరిగిన సమావేశంలో ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు : పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణాను అందించనున్నట్టు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ ఈ.దినేష్‌కుమార్ అన్నారు. కె.కోటపాడులో శుక్రవారం కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల పశువైద్య సహాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఒక్కో రైతుకు 50 కిలోల పశుదాణాను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ పశుదాణాను పశువులకు మేతగా ఇవ్వడం వల్ల పాలదిగుబడి పెంపుతో పాటు ఆరోగ్యం సమకూరుతుందని తెలిపారు. దాణా కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో గల పశువైద్య సహాయకులను సంప్రదించాలన్నారు.ఇంకా పశుబీమాను చేయించని పశువులకు రైతులు తప్పనిసరిగా బీమా చేయించాలన్నారు. కార్యక్రమంలో కొరువాడ, చౌడువాడ పశువైద్యాధికారులు సిహెచ్.వై. నాయుడు, సింహచలంనాయుడు పాల్గొన్నారు.